
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 9 డిసెంబరు 2024 | 5


కాకినాడ జేఎన్‌టీయూలో ఎమ్మెల్సీ కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



రెవెన్యూ సమస్యలకు చెక్

- రేపటి నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులు
- మూడురోజులపాటు నిర్వహణ
- ఆయా మండలాల్లో షెడ్యూల్ ఖరారుకు అధికారులు నిమగ్నం

రెవెన్యూ సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. గత ప్రభుత్వ హయాంలో భారీగా భూ అవకతవకలు జరిగాయి. జగనన్న ఇళ్లకాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాల పేరిట పెద్దఎత్తున భూ దందా జరిగిందనే విమర్శలున్నాయి. దీనికి తోడు 20ఏళ్లు దాటిన డీ పట్టా భూములను అమ్ముకోవచ్చన్న జీవోతో వందలాది ఎకరాలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం జూన్ నెల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు స్వీకరిస్తోంది.

సామర్లకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 85వేల పైబడి ఫిర్యాదులు వచ్చాయని అధికారుల గణాంక సమాచారం ద్వారా తెలుస్తోంది. అందులో 62శాతం ఫిర్యాదులకు ప్రభుత్వం పరిష్కార మార్గం చూపించింది. రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి వినతులు స్వీకరించి సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 10 నుంచి జిల్లాలో అన్ని మండలాల గ్రామాల్లో మూడురోజులపాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. ఈ మేరకు రెవెన్యూ యంత్రాంగం అన్ని సన్నాహాలు చేస్తోంది. జిల్లాలో అన్నిమండలాల్లో వార్డు, గ్రామ సచివాలయాల్లో పంచాయతీలవారీగా గ్రామ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శిస్తారు. భూ ఆక్రమణలు, 22ఏలో ఉన్న భూముల తారుమారు వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తారు. వాటిని సరిచేసి బాధితులకు న్యాయం చేస్తారు. సదస్సులపై తొలుత రాజకీయ నేతలు, స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. సన్నాహక సమావేశంలో ప్రభుత్వ ముఖ్యఉద్దేశ్యాన్ని తెలియజేస్తారు. గ్రామాల్లో ముఖ్యప్రదేశాల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. సదస్సుకు రెండురోజుల ముందు గ్రామానికి సంబంధించి అడంగళ్, పహాణీ, ప్రభుత్వ భూ రిజిస్టర్ కాపీలు ముద్రించి వీఆర్వో ప్రదర్శిస్తారు. స్వీకరించిన అర్జీలకు రశీదులు, తక్షణం తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదిక అందించాల్సి ఉంటుంది. జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండ్యన్‌ని పర్యవేక్షణాధికారిగా ప్రభుత్వం నియమించింది.

అన్ని శాఖలతో బృందం..

సదస్సులకు సంబంధించి గ్రామాల వీఆర్వో, మండల సర్వేయర్, దేవదాయశాఖ అధికారి, అవసరమైనచోట వక్ఫ్‌బోర్డు అధికారి, రిజిస్ట్రేషన్ అధికారి, అటవీ భూములకు సంబంధించి అధికారి ఉంటారు. ఆయా గ్రామాల్లో రీసర్వే పూర్తయితే నూతనంగా తయారు చేసిన ఆర్వోఆర్‌ను చదివి అభ్యంతరాలు స్వీకరిస్తారు. పార్టీ లోగోలు, రంగులతో కూడిన బీహెచ్‌పీలను తిరిగి సేకరిస్తారు. మళ్లీ తాజాగా రైతులకు అందిస్తారు. కలెక్టర్, జేసీ సైతం సదస్సుల్లో పాల్గొంటారు. ఆర్డీవోలు విధిగా ప్రతిమండలంలో రెండు గ్రామాలను సందర్శిస్తారు. సదస్సుల్లో వచ్చిన వినతులను అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. కొన్ని తక్షణమే పరిష్కరిస్తారు. మిగిలినవి ఉన్నతాధికారులకు చేరవేస్తారు. సదస్సుల నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఇప్పటికే సామర్లకోట, కాకినాడ రూరల్ తదితర మండలాల రెవెన్యూ అధికారులతో అవగాహనా సదస్సులు నిర్వహించారు. సదస్సులు పూర్తయిన 45రోజుల్లో సమస్యకు తప్పకుండా పరిష్కార మార్గం చూపించడమే ఈ సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమని రెవెన్యూ ఉన్నతాధికారి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఉచితంగానే 49 రకాల ధ్రువపత్రాలు

రెవెన్యూశాఖ ద్వారా జారీ చేసే 49 రకాల ధ్రువపత్రాల మంజూరు, ఇతర సేవలకు ప్రభుత్వం యూజర్ చార్జీల నుంచి మినహాయింపు ఇచ్చిందని రెవెన్యూ ఉన్నతాధికారి ఆంధ్రజ్యోతికి తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అందుతున్న వినతుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కంప్యూటర్ అడంగళ్, సర్వే నెంబరు, ఎల్‌పీ నెంబరు, డూప్లికేట్ ఈబీసీ, ఓబీసీ, ఇంటిగ్రేడ్ ధ్రువపత్రాలు, పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్, రెండోసారి జారీ చేసే ఆదాయ ధ్రువపత్రం, ఆర్ఓఆర్, వాటర్ ట్యాక్స్ దరఖాస్తు, వ్యవసాయభూమి విలువ దరఖాస్తు, ఆర్డీవో జారీ చేసే కౌలు, ఆర్ఓఆర్, కోర్టు కేసులు, సర్వే పంచనామా, ఇనాంచ ఓఆర్‌సీ, ధ్రువపత్రాలు, పేరు మార్పు ధ్రువపత్రం, ఏపీ చుక్కల భూముల చట్టం కింద క్లెయిమ్స్, పాత ఈ పాస్‌బుక్ స్థానంలో కొత్తది జారీ, డీ-పట్టా, ఇళ్లస్థలం పట్టా, ఆదాయ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, ఆస్తిపత్రం, ఇనాం భూములపై ఆక్యుపెన్సీ హక్కుపత్రం, చిన్న, సన్నకారు ధ్రువపత్రం, జీవో 225ప్రకారం భూకేటాయింపు మాన్యువల్ అడంగళ్, పట్టాదారు ఆధార్ సీడింగ్, మొబైల్ నెంబరు పట్టాదారు ఆధార్ సీడింగ్ సేవలను ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మా..స్టారొస్తారు!

ఎమ్మెల్సీ ఫలితం తేలేది నేడే

- ఉదయం 8 నుంచి లెక్కింపు
- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- ఇద్దరి మధ్య ప్రధాన పోటీ
- పోలైన ఓట్లు 15,490
- బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- ఆలస్యంగా ఫలితం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మా..స్టారెవరో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.. ఇప్పటికే ఫలితం బాక్సుల్లో భద్రంగా ఉంది.. నేటి లెక్కింపుతో ఉత్కంఠకు తెరపడుతుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు కాకినాడ జెఎన్‌టీయూలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఆరంభమవుతుంది. బ్యాలెట్ పత్రాల లెక్కింపు వల్ల కౌంటింగ్ కాస్త నెమ్మదిగా జరగవచ్చు.ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో మొత్తం 16,737 మంది ఓటర్లు ఉండగా 15,502 ఓట్లు పోలయ్యాయి.అది 92.62 శాతంగా ప్రకటించారు. కానీ ఈ రోజు ప్రకటనలో పోలైన ఓట్లు 15,490గా చెబుతున్నారు.12 ఓట్లు తేడా వచ్చింది.యూటీఎఫ్‌కు చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది ఉండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో మొత్తం ఐదుగురు అభ్యర్థులు స్వతంత్రంగా పోటీపడ్డారు. యూటీఎఫ్ నేత బొర్రా గోపిమూర్తి, గంధం నారాయణరావు, షులుగు దీపక్, డా.కవల నాగేశ్వరరావు, నామన వెంకటలక్ష్మి(విళ్ల లక్ష్మి) పోటీ పడ్డారు. కానీ పోటీ ప్రధానంగా బొర్రా గోపీమూర్తి, గంధం నారాయణరావు మధ్యే ఉంటుందనే ఆయా వర్గాల కథనం. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువగా గోపీమూర్తికి వేయగా, ప్రైవేట్ స్కూళ్ల నుంచి నారాయణరావుకు ఓట్లు బాగా పడినట్టు ప్రచారం జరుగుతోంది. ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికలంటే చాలా ప్రాధాన్యత ఉంటుంది. గతంలో కార్పొరేట్ విద్యాసంస్థల యజమానులు పోటీ చేసి గెలిచిన సందర్భాలు ఉన్నాయి.ఈ సారి పోటీ రసవత్తరంగానే సాగినట్టు చెప్పవచ్చు. మిగతా అభ్యర్థులు కొంతమేర ఓట్లను చీల్చే అవకాశం ఉంది. వైసీపీ ఐదేళ్లలో టీచర్ల నోళ్లను వైసీపీ ప్రభుత్వం నొక్కేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శాసన మండలిలో తమ తరఫున మాట్లాడడానికి ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చిన ఉద్యమ నేతకే పట్టం కట్టాలని కొన్ని సంఘాలు భావించాయి.ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను పోటీకి పెట్టలేదు. ఇక్కడ సీపీఐ మాత్రం ఎస్టీయు సంఘం తరఫున గంధం నారాయణరావుకు సపోర్టు చేయడం గమనార్హం. పార్టీలకతీతంగా ఎన్నికలు జరగడంతో పెద్దగా ప్రచార ఆర్భాటం కనిపించని సంగతి తెలిసిందే.గెలుపు ఎవరిదనే దానిపై ఎవరి ధీమా వారికి ఉంది.

14 టేబుళ్లపై.. 9 రౌండ్లలో లెక్కింపు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఆర్వో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5న తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం సంబంధించిన పోలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియలో 15,490 ఓట్లు నమోదయ్యాయన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరిచామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు.కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుళ్లపై 9రౌండ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం డీటెయిల్డ్ కౌంటింగ్ నిర్వహించామన్నారు.

కౌంటింగ్‌కు డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘా : ఎస్పీ


స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న ఎస్పీ

కాకినాడక్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ కాకినాడ జేఎన్‌టీయూకేలో ఆదివారం పరిశీలించారు.ఇన్, అవుట్ గేట్ల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కాకినాడ ఎస్డీపీవో రఘువీర్ విష్ణును ఆదేశించారు. ఎలక్షన్ అధికారులు,పోలింగ్ ఏజెంట్ల సెల్‌ఫోన్లను బయట సెల్‌ఫోన్ కౌంటర్లలో జమ చేసి లోనికి వెళ్లాలని సూచించారు. కౌంటింగ్ నిర్వహించే భవనాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. జేఎన్‌టీయూకే ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో వాహనాలను పార్క్ చేసి కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని సూచించారు. ఆయన వెంట ఎస్డీపీవో రఘువీర్ విష్ణు, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు ఉన్నారు.


కాలువపైనే పార్కింగ్ చేసుకున్న వాహనాలు

పక్కా.. ప్లానింగ్!

పట్టణప్రణాళికా విభాగం అవినీతికి అడ్డాగా మారిపోయింది. పట్టణ పరిధిలో అక్రమ భవన నిర్మాణాల జోరు సాగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఎవరైనా స్థానికులు ఫిర్యాదుల చేస్తే పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఆయా నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. భవన నిర్మాణదారులనుంచి భారీగా మామూళ్లు తీసుకుంటున్నట్లు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ కట్టడాలపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదని పలువురు అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

- పెద్దాపురంలో అడ్డగోలుగా భవన నిర్మాణాలు
- సెట్‌బ్యాక్ నిబంధనలకు తూట్లు
- ప్లాన్ ప్రకారం ఖాళీ స్థలం వదలని భవన యజమానులు
- కాలువలపైనే పార్కింగ్, నిర్మాణాలు
- వాణిజ్య అవసరాలకు సెల్లార్ల వినియోగం
- ప్రభుత్వ స్థలాల్లో వ్యాపారాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

పెద్దాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పట్టణ పరిధిలోని బహుళ అంతస్థుల భవన నిర్మాణాలు జరుగుతున్నా అవేమీ పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా కొన్నిచోట్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ప్లాన్‌లో ఒకరకంగా ఉంటే క్షేత్రస్థాయిలో భవన నిర్మాణం మరో విధంగా ఉంటోంది. కొన్నిచోట్ల అనుమతులు లేకుండానే అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. ఇదంతా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు తెలిసినప్పటికీ రాజకీయ జోక్యం కారణంగా అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు గాలికి.. అంతస్థులు పైపైకి..

పెద్దాపురం పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో పలువురు జీ+1, జీ+2 నిర్మాణాలకు అనుమతి పొంది మూడు, నాలుగు అంతస్థులు నిర్మిస్తున్నారు. భవనం చుట్టూ నిర్ణీత వెడల్పుతో ఖాళీ స్థలం(సెట్ బ్యాక్) వదలాలి. కానీ స్థలమేమీ వదలకుండా సరిహద్దుల వరకూ భవనాలు నిర్మిస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్లను వాణిజ్య అవసరాలకు వీలుగా కొన్నిచోట్ల నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం బహుళ అంతస్థుల భవనాల మెట్లను 1.25 మీటర్ల తగ్గకుండా వెడల్పు ఉండేలా నిర్మించాలి. కానీ చాలా భవనాలు మూడు అడుగుల వెడల్పు మాత్రమే ఉంటున్నాయి. నూతన భవన నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్లాన్‌కు విరుద్ధంగా పనులు జరుగుతుంటే అధికారులు అడ్డుకోవాలి. కానీ ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రధాన వీధుల్లో సెంటున్నర స్థలం ఏకంగా 3అంతస్థులతో భవన నిర్మాణాలు చేపడుతున్నారు.

డ్రైనేజీలపైనే నిర్మాణాలు..

భవన నిర్మాణదారులు మేజర్ డ్రైనేజీ, కాలువలు, ఫుట్‌పాత్‌లను ఆనుకుని భవన నిర్మాణాలు జరుపుతున్నారు. పైగా డ్రైనేజీలపై నిర్మాణాలు, వాటినే పార్కింగ్ స్థలాలుగా ఉపయోగిస్తున్నారు. దీంతో వర్షాకాలంలో డ్రైనుల్లో నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పైగా మురుగునీరు ఇళ్లలోకి వెళ్లిపోతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు ఆయా భవన నిర్మాణదారులతో అధికారులు కుమ్మక్కైపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మెయిన్‌రోడ్డులో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నట్లు పలువురు చెబుతున్నారు. పైగా అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల కారణంగానే ఇవి సాగుతున్నట్లు పలువురు చెప్తున్నారు. గతంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు నేరుగా ఇంటి ప్లాన్‌లు మంజూరు చేసేవారు. ఈ క్రమంలో అక్రమాలు జరుగుతుండడంతో ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ, అనుమతుల మంజూరులో అక్రమాలు ఆగలేదు. లైసెన్సు పొందిన కొందరు ప్రైవేటు సర్వేయర్లు ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి అక్రమాలకు అవకాశం కల్పిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణ అనుమతుల్లో నిబంధనలు ఉల్లంఘించడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. దీంతో మున్సిపాలిటీకి ఆదాయం తగ్గిపోతోంది. అపార్టుమెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫంక్షన్ హాళ్లకు పార్కింగ్‌స్థలాలు ఉండాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. ఇలాలేని నిర్మాణాలను తొలగించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులు అమలుకావడం లేదన్నవిమర్శలు వస్తున్నాయి.

అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. కాలువల పైన అక్రమ నిర్మాణాలు ఉంటే సంబంధిత భవన యజమానులకు నోటీసులు ఇస్తాం. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్లాన్ ప్రకారమే భవనాలను నిర్మించుకోవాలి. అనధికార కట్టడాలపై విచారణ చేసి చర్యలు చేపడతాం.

-సీహెచ్.ఫణికుమార్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, పెద్దాపురం

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

- పరీక్ష రాసిన 3593మంది విద్యార్థులు
- 94.82 శాతం హాజరు నమోదు


సెయింట్ ఆన్స్ పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో పి.రమేష్

కాకినాడ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్) 2024-25 పరీక్ష కాకినాడ జిల్లాలోని కాకినాడ, పెద్దాపురం రెండు రెవెన్యూ డివిజన్లలోని 14 కేంద్రాల్లో 3789మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 3593మంది విద్యార్థులు హాజరుకాగా 196మంది పరీక్ష రాయలేదని మొత్తం 94.82శాతం హాజరు నమోదైనట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను డీఈవో పరిశీలించారు, పరీక్షలు జిల్లా అంతటా ప్రశాంతంగా జరిగాయన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని సోమవారం విడుదల చేసి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు. కీ పై వచ్చే అభ్యంతరాలను వెబ్‌సైట్‌లోని గ్రీవెన్స్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని ఏసీఈ రాజశేఖర్ తెలిపారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీ


రైస్‌మిల్లులను తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్‌మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆదివారం సామర్లకోట మండలంలోని ఉండూరులోని దేవీ రైస్‌మిల్లును, కరప మండలం అరట్లకట్ల గ్రామంలోని వెంకటేశ్వర ట్రేడ్స్ రైస్ మిల్లులపు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్‌మిల్లులో ధాన్యం కొనుగోలు ఎలా చేస్తున్నారు, మిల్లుకు ఎలా తీసుకొస్తున్నదీ, ఎంత రేటు కడుతున్నదీ.. తదితర వివరాలను అడిగి పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ మేనేజర్ దేవులా నాయక్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం అనివార్య కారణాల వల్ల రద్దుచేశామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన ఆదివారం విడుదల చేశారు.

మళ్లీ పొంచి ఉన్న ముప్పు

- సాయంత్రం నుంచి మారిన వాతావరణం
- రైతుల్లో ఆందోళన
- ఆరబెట్టిన ధాన్యం ఒబ్బిడి చేసుకోవడంలో నిమగ్నం


పిఠాపురం-సామర్లకోట రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం రాశులు

పిఠాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సార్వా సీజన్‌లో పంట చేతికందే సమయంలో మరోమారు తుఫాన్ ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో 11వతేదీ నాటికి వాయుగుండం ఏర్పడి వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ సమాచారం. ఇదే సమయంలో ఆదివారం సాయంత్రం నుంచి మారిన వాతావరణం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఆరబెట్టిన ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకోవడంలో వారు నిమగ్నమయ్యారు. నెలరోజుల వ్యవధిలో మూడోసారి బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడుతుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న అల్పపీడన ద్రోణి వాయుగుండంగా, ఆపై తుఫాన్‌గా మారే అవకాశం ఉందని తెలియజేసింది. 11వతేదీ నుంచి కాకినాడ జిల్లాతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని సమాచారం ఇచ్చారు. ఆదివారం సాయంత్రం 4గంటలు నుంచే వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఉదయం నుంచి ఎండ కాసినప్పటికీ సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై గాలుల ప్రభావం మొదలైంది.

70శాం మాసూళ్లు పూర్తి

ఏలేరు, పీబీసీ ఆయకట్టుతోపాటు కాకినాడ జిల్లాలో సార్వా వరికోతలు, మాసూళ్లు 70శాతం వరకూ పూర్తయ్యాయి. పలుచోట్ల ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎక్కువశాతం వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు నిర్వహిస్తుండడంతో తేమ శాతం తగ్గడానికి ధాన్యం రాశులను కళ్లాలు, ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంబడి ఆరబోస్తున్నారు. కనీసం నాలుగయిదు రోజులు ఆరబెడితేనే ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతం వస్తోంది. దీనితో ధాన్యం ఆరబోయక తప్పడం లేదు. కనీసం వారం ధాన్యం ఆరబెట్టిన తర్వాతే మిల్లర్లు ధాన్యాన్ని కొంటున్నారని, లేకుంటే బస్తాకు రూ.200 నుంచి 500 వరకూ తగ్గించేస్తున్నారని రైతులు తెలిపారు.

అంతా హడావుడే..

ఇటీవల వచ్చిన తుఫాన్ ప్రభావం తగ్గిన తర్వాత కోతలు, మాసూళ్ల(నూర్పిళ్ల)ను వేగంగా నిర్వహిస్తున్నారు. కుప్పలు వేసిన వారు సైతం యంత్రాల ద్వారా నూర్పిళ్లు, ఆరబోత పూర్తి చేస్తున్నారు. మూడురోజులుగా ఎండ కాస్తుడడంతో కత్తిపూడి-తిమ్మాపురం మధ్య గల జాతీయరహదారిపై చేబ్రోలు, గొల్లప్రోలు, పిఠాపురం బైపాస్‌రోడ్లు, అంతర్గత గ్రామీణ రహదారులు, సామర్లకోట-పిఠాపురం-ఉప్పాడ రోడ్డు వెంబడిధాన్యం రాశులను ఆరబోశారు. సాయంత్రం నుంచి వాతావరణం మారిన నేపథ్యంలో ఆరబెట్టిన ధాన్యం రాశులను హడావుడిగా దగ్గరకు చేర్చి టార్పాలిన్లు, బరకాలు కప్పడంలో నిమగ్నమయ్యారు. మరికొందరు రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురవకుండా ఉంటే ధాన్యాన్ని పూర్తిగా ఒబ్బిడి చేసుకోగలుగుతామని రైతులు ఆశిస్తున్నారు.

కాకినాడలో సినీనటి శ్రీలీల సందడి

7

- జేసీ షాపింగ్ మాల్ ప్రారంభం



కాకినాడలో జేసీ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా భారీసంఖ్యలో వచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న సినీనటి శ్రీలీల

వైభవంగా శ్రీ పుష్పయోగ మహోత్సవం

అన్నవరంలో ముగిసిన సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణోత్సవాలు


పుష్పోత్సవంలో నవదంపతులు

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైయున్న సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రాత్రి 7గంటలకు పండితులు ఆధ్వర్యంలో శ్రీపుష్పయోగ మహోత్సవం అంగరగ వైభవంగా జరిగింది. ముందుగా నవ దంపతులైన శ్రీవల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యశ్వరులను ప్రత్యేకంగా సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన ఊగుటూయలలో ఆశీనులు గావించి గణపతిపూజ, పుణ్యాహవచనం, పుష్పోత్సవం నిర్వహించారు. విశేషమైన మధురఫలాలు, తీపిపదార్థాలను నవదంపతదులకు నివేదించి దంపతీతాంబూలాలు అందించారు. అనంతరం చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం ఏకాంతసేవ నిర్వహించారు.


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బిక్కవోలులో కనుల పండువగా రథోత్సవం

వైభవంగా శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు


బిక్కవోలులో శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు, మెయిన్‌రోడ్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

బిక్కవోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, బ్యాండు మేళాల మధ్య ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి కోలాట మండలి సభ్యుల కోలాటం, బ్యాండ్ కచేరిలు, కేరళ వాయిద్యాలు అందర్నీ అలరించాయి. స్వామివారి రథం వంగా వారి వీధి నుంచి మెయిన్‌రోడ్ మీదుగా రాజారావుపేట, గ్రామంలోని పురవీధుల గుండా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ ఛైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, వంగా పుల్లా రెడ్డి, తొండాపు శ్రీనివాసరెడ్డి, మానుకొండ రాంబాబు, నందిపాటి కిషోర్‌రెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, పల్లి రాజారెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనపర్తి సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసులు రథం చుట్టూ బందోబస్తు నిర్వహించారు.

బాణసంచా కాల్పులు, గ్రామోత్సవం

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి గ్రామోత్సవం, బాణసంచా కాల్పులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో తీన్‌మార్, బ్యాండ్ కచేరీలు, నెమలి నాట్యాలు, నవదుర్గలు కనువిందు చేశారు. అలాగే బిక్కవోలు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాణసంచా కాల్పివేత అందర్నీ మంత్ర ముగ్ధులను చేసింది. ఈతచెట్టు, మల్లెపందిరి, నిప్పులు వెదజల్లే షాట్‌లు, రంగురంగుల కాంతులిచ్చే బిగ్ షాట్‌లు, నిప్పురవ్వలు విడుస్తూ వెళ్లే రాకెట్‌లు కాల్చారు.


బాణసంచా కాంతులు

కాకినాడలో సినీ నటి శ్రీలీల సందడి

జేసీ షాపింగ్ మాల్ ప్రారంభం



కాకినాడలో జేసీ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న శ్రీలీల


షాపింగ్ మాల్‌లో సందడి చేస్తున్న శ్రీలీల

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో ప్రముఖ సినీ నటి శ్రీలీల సందడి చేశారు. ఆదివారం ప్రముఖ జేసీ షాపింగ్ మాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యనూతన ఫ్యాషన్లకు నిలయమైన జేసీ మాల్‌ను కాకినాడలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మూడంతస్తుల్లో ఉన్న మాల్ సముదాయంలోని వస్త్రాలను ఆమె పరిశీలించారు. పట్టు, ఫ్యాన్సీ చీరలను చూపించారు. తెలుగు రాష్ట్రాల్లో చాలా షోరూంలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడ షోరూం మూడోదిగా పేర్కొన్నారు. జేసీ మాల్‌లో అన్ని వర్గాలవారికి అందుబాటు ధరల్లో ఆధునిక శైలితో కూడిన వస్త్రాలను అమ్మకాలు చేస్తుంటారన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాలవాసులు ఇక్కడి జేసీ మాల్‌కు వచ్చి కొనుగోలు చేయాలన్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు, పురుషులకు ఇక్కడ అద్భుతమైన వస్త్రశేణి ఉందన్నారు. జేసీ మాల్ అధినేతలు ఎం.వెంకటరెడ్డి, జమున మాట్లాడుతూ కాంబో ఆఫర్లను ఇస్తున్నామన్నారు. తక్కువ ధరలో నాణ్యతతో కూడిన వస్త్రాలను అమ్మకాలు చేయడమే తమ విజయ సూత్రమన్నారు. అనంతరం శ్రీలీల మాల్ బయట ఏర్పాటు చేసిన వేదికపైకి రాగానే యువత కేరింతలు కొట్టారు. ఆమె లవ్ కాకినాడ అంటూ అందరినీ ఉత్సాహపరిచారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ రాజ్యలక్ష్మి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

తొలిరోజు సర్వపుష్ప పూజ


సర్వపుష్పపూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతుల అలంకారం


పిఠాపురం పురవీధుల్లో దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం

పిఠాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రాచుర్యం పొందిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, వేదపారాయణ, రుత్విక్కులచే మూల మంత్ర అనుష్ఠానం, గణపతి అధర్వ శీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, శ్రీపాదశ్రీవల్లభుల దివ్యపాదపద్మములకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకిసేవ, సాయంకాలార్చన నిర్వహించారు. అంతకు ముందు ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పురవీధుల్లో ఉత్సవం సాగింది. సర్వపుష్ప అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల తొలిరోజు మహారాష్ట్ర, ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్నాటక నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య తదితరులున్నారు.

పాదగయలో నేటి నుంచి...

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వేదోక్త విధిననుసరించి దత్తాత్రేయ మంత్రానుష్ఠానము, హోమములు, గురుచరిత్ర పారాయణము, వేదపారాయణ, యతిపూజ, లక్ష బిల్వార్చన, సత్యదత్త వ్రతాదులతో సప్తాహదీక్షతో ఉత్సవాలు నిర్వహిస్తారు. డిసెంబరు 15 వరకూ జరిగే ఉత్సవాల్లో రోజూ మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, రుత్విక్కులతో దత్తమాల మంత్ర అనుష్ఠానం, గురుచరిత్ర పారాయణ, వేదపారాయణ, గణపతి అథర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు, మధ్యాహ్నం 3గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్తమూల మంత్రహోమాదులు, సాయంత్రం సాయంకాల విశేష పుష్పార్చన జరుగుతాయి.

హైదరాబాద్ నుంచి పిఠాపురం దత్త పీఠానికి...

పాదయాత్రగా ఆలమూరు చేరుకున్న బృందం


పిఠాపురం దత్త పీఠానికి పాదయాత్ర చేస్తున్న బృందం సభ్యులు

ఆలమూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీదత్తపీఠానికి హైదరాదాద్‌లోని శ్రీవల్లభదత్త పీఠం నుంచి పాదయాత్ర చేస్తున్న బృందం ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరుకు చేరుకుంది. లోకశాంతి కోసం ఈనెల 3న హైదరాబాద్‌లో శ్రీవల్లభదత్త పీఠం మాతాజీ శ్రీలత దత్త ఆధ్వర్యంలో బయలుదేరిన బృందం ఈనెల 11కు పిఠాపురం చేరుకోనున్నారు. ఆలమూరు నుంచి గుమ్మిలేరు చేరుకున్నవారికి పద్మావతి సేవా కేంద్రంలో సర్పంచ్ గుణ్ణం రాంబాబు బస ఏర్పాటు చేశారు. శ్రీవల్లభుని కర్మ, భక్తి సిద్ధాంతాన్ని అనుసరిస్తూ సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ పాదయాత్ర చేస్తున్న బృందాన్ని గుమ్మిలేరు గ్రామస్తులు అభినందించారు.

దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

125 గ్రాముల బంగారు వస్తువుల స్వాధీనం

రాజోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో రెండు చోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మండలం యర్రంశెట్టివారిపాలేనికి చెందిన కె.వెంకటేశ్వరరావును అరెస్టు చేసి రూ.8 లక్షల 50వేలు విలువ చేసే 125 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. రాజోలు పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన వివరాలు తెలిపారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో బీరవారి కాల్వగట్టుకు చెందిన బీరా సువర్ణరాజు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావులకు చెందిన ఇంట్లో ఏడాది క్రితం దొంగతనం జరిగిందన్నారు. నిందితుడు వెంకటేశ్వరరావును గుర్తించి దిండి చెక్‌పోస్టు వద్ద సఖినేటిపల్లి ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాసరావు అరెస్టు చేసినట్టు తెలిపారు. కేసును చేధించిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని డీఎస్పీ గోవిందరావు, ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

ఇరువర్గాల కొట్లాటలో 20 మందిపై కేసులు

ఆత్రేయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకల్లో భాగంగా రెండు సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణకు దిగి దాడులకు పాల్పడడంతో 20 మందిపై కేసులు నమోదు అయ్యాయి. ఈ సంఘటన నేపథ్యంలో పోలీస్ పికెట్ కొనసాగుతుంది. ఆదివారం ఇరువర్గాలకు చెందిన పెద్దలతో సీఐ విద్యాసాగర్ శాంతి సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. 2 సామాజిక వర్గాలు శాంతియుతంగా నడుచుకోవాలన్నారు. శనివారం రాత్రి పేరవరంలో షష్ఠి తీర్థమహోత్సవంలో తమపై దాడులకు పాల్పడిన్నట్టు ఒక వర్గానికి చెందిన వెంకటేశ్వరరావు, మరోవర్గానికి చెందిన తాళ్ళ గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 20మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాము తెలిపారు.

ప్రజా హక్కుల పోరాటంలో 'ఐలాజ్' ముఖ్యపాత్ర

అన్నవరంలో మొదటి రాష్ట్ర మహాసభ



ప్రసంగిస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి రత్నకుమార్

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా న్యాయవాదుల ప్రయోజనాలు కాపాడటంతో పాటుగా ప్రజల హక్కుల పోరాటంలో ఆల్‌ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ముఖ్య పాత్ర పోషిస్తుందని రాష్ట్ర నాయకులు బుగత శివ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడలో అన్నవరంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో మొదటి రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాతీయ ప్రధాన కార్యదర్శి క్లిష్టన్ డి రోజారియా విచ్చేశారు. ఐలాజ్ రెండేళ్లుగా న్యాయవాదులపై, మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించి వాటిని అరికట్టేందుకు ఉద్యమించడం జరిగిందన్నారు. 60 ఏళ్లు దాటిన న్యాయవాదులను పెన్షన్ల సౌకర్యం కల్పించడం, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహలపై పోరాటం చేస్తుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దులో ఐలాజ్ ముఖ్య భూమిక పోషించిందన్నారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి జేసు రత్నకుమార్, ఐలాజ్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం 15 మందితో నూతన రాష్ట్రకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రాం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రాఘవేంద్ర రావు, కార్యదర్శిగా బుగతా శివ కోశాధికారిగా అవసరాల శ్రీదేవి ఎన్నికయ్యారు.


కార్యక్రమానికి హాజరైన న్యాయవాదులు

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఒకరి మృతి మరొకరికి తీవ్రగాయాలు


ప్రమాదంలో ఆటో, మృతిచెందిన సూర్యచంద్రం

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఉల్లిపాయల లోడు ఆటోను ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం (35), శ్రీరాముల దుర్గారావు ఊరూరా తిరుగుతూ ఆటోలో ఉల్లిపాయలు వ్యాపారం చేస్తుంటారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో ఆదివారం ఉల్లిపాయలు విక్రయించుకుని కాపవరం వైపు వస్తుండగా కాపవరం జంక్షన్‌లోని రాళ్ళమడుగు వంతెనపై నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందువెళుతున్న లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్, ఉల్లిపాయలు విక్రయిస్తున్న ఇద్దరు కిందపడిపోయారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం (35) ఆసుపత్రిలో మృతిచెందాడు. మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీరాముల దుర్గారావును జీఎస్ఎల్‌కు తరలించారు. కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ హత్య

వివాహేతర సంబంధమే కారణం?


మీనాకుమారి మృతదేహం

కాకినాడ క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ హత్యకు గురైన సంఘటన ఆదివారం కాకినాడలో జరిగింది. కాకినాడ పర్లోవపేట ఏఎంజీ స్కూల్ వెనుక వీధికి చెందిన ఆకుల మీనాకుమారి (35) కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తోంది. కాగా పదేళ్ల క్రితం విభేదాలు వచ్చి భార్యభర్తలు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. మీనాకుమారి తాపీ పనిలో కూలీగా వెళ్తూ తన బిడ్డలను పోషించుకుంటోంది. ఈ క్రమంలో స్థానిక రామకృష్ణారావుపేటకు చెందిన 42ఏళ్ల సబ్బి రాంబాబురెడ్డితో ఐదేళ్లక్రితం ఆమెకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధంగా మారింది. అతడు కూడా తన భార్యతో విభేదించి రామకృష్ణారావుపేటలో తన తల్లితో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ ఒకరింటికి ఇంకొకరు రాకపోకలు సాగిస్తున్నారు. నెల రోజుల నుంచి మీనాకుమారి వద్దకు వేరే వ్యక్తి రావడాన్ని రాంబాబురెడ్డి గమనించాడు. ఈ క్రమంలో ఆమె 3రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌ను స్విచ్‌ఆఫ్ చేసింది. దీంతో రాంబాబురెడ్డి ఆమెకు ఫోన్ చేసి.. చేసి.. సహనం కోల్పోయాడు. ఎట్టకేలకు ఆమె ఆదివారం సెల్‌ఫోన్‌ను స్విచ్‌ఆన్ చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య ఫోన్‌లో గొడవ జరిగింది. అనంతరం మీనాకుమారి నేరుగా రామకృష్ణారావుపేట రాంబాబురెడ్డి ఇంటికి వెళ్లింది. అక్కడ ఇద్దరి మధ్య తారాస్థాయిలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో అతడు క్షణికావేశంలో ఇనుపరాడ్‌తో ఆమె తలపై మోదాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో పడిఉన్న ఆమెను స్థానికులు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రమత్తులో ట్రక్కు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఊబలంక వాసిగా గుర్తింపు


అప్పారావు (ఫైల్)

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి ఊబలంక గ్రామానికి చెందిన మల్లిడి అప్పారావు (63)గా గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎంవివి.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన మల్లిడి అప్పారావు మరికొంతమందితో కలిసి చేపలవేటకు ఈనెల 6వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి తెలంగాణ రాష్ట్రం భద్రాచలం జిల్లా మణుగూరు వెళ్లారు. అక్కడ చెరువులో చేపలు పట్టి పని పూర్తికావడంతో మధ్యాహ్నం బడాదోస్తు ట్రక్కు వాహనంలో వలలు ఎక్కించుకుని నలుగురు వ్యక్తులు ఇంటికి బయలుదేరారు. ట్రక్కులో వలలపై పడుకున్న అప్పారావు కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్ సమీపానికి వచ్చేసరికి శనివారం రాత్రి వాహనం నుంచి కిందపడిపోయాడు. అప్పారావు పైనుంచి అనేక వాహనాలు వెళ్లిపోవడంతో మృతదేహం ముక్కలు అయిపోయి చెల్లాచెదురుగా పడింది. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ముక్కలు అయిపోయిన మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇది గమనించకుండా మిగిలినవారు ట్రక్కులో ఊబలంక వెళ్లిపోయారు. అక్కడ చూసుకుని అప్పారావు లేకపోవడంతో మళ్లీ అదే వాహణంలో వెనక్కి వెతుక్కుంటూ వచ్చారు. కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్‌వద్ద ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడని తెలిసి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. మృతదేహం వద్ద ఉన్న దుస్తుల ఆధారంగా మల్లిడి అప్పారావు (63)గా గుర్తించారు. మృతుడి అల్లుడు పెసంగి మోసేరాజు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎంవివి. సత్యనారాయణ తెలిపారు.

తాండవ నదిలో యువకుడి గల్లంతు

తుని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెనికి చెందిన గెడ్డం సాయి(23) శనివారం ఉదయం కాలు జారి తాండవ నదిలో గల్లంతయ్యాడు. స్థానికులు సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం వెలికితీత చర్యలు ముమ్మరం కాకపోవడంతో సాయి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగావిలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి

ట్రాక్టర్ కింద పడి తీవ్రగాయాలు

మార్గమధ్యలో కూతురు... ఆసుపత్రిలో తల్లి దుర్మరణం


గోపాలపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతిచెందారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం బండార్లగూడెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీటీచర్ కురసాని కాంతమ్మ (45) ఆదివారం తల్లి కవలం గన్నమ్మ (75)ను తీసుకుని స్కూటీపై దొండపూడి నుంచి కుంకాల వైపు వెళుతున్నారు. దొండపూడి వద్ద తల్లీకుమార్తె ప్రయాణిస్తున్న స్కూటీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో ఎల్లండిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కాంతమ్మ మృతి చెందింది. అనంతరం తల్లి కవలం గన్నమ్మను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆమె మృతి చెందింది. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తల్లీకూతురు మృతిచెందడంతో బండార్లగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఊర చెరువులో పడి వ్యక్తి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అనపర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం కుతుకులూరు ఊర చెరువులో పడి అనపర్తికి చెందిన దొడ్డు మధుకుమార్ (54) మృతిచెందాడు. అనపర్తి ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తికి చెందిన దొడ్డు మధుకుమార్ గత కొన్నేళ్లుగా అనపర్తిలోని నివాసం ఉంటూ ప్రైవేటుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి కుతుకులూరులోని ఊర చెరువు సమీపంలో తన మిత్రులతో కలిసి మద్యం తాగాడు. మద్యం మత్తులో ఉన్న మధుకుమార్ సమీపంలోని ఊర చెరువులో పడి మృతిచెందాడు. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు మధుకుమార్ బంధువులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మండపేటకు చెందిన మధుకుమార్ కొంతకాలం కుతుకులూరులో నివాసం ఉండగా ప్రస్తుతం అనపర్తిలోని నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి ఏమి జరిగిందన్న అంశంపై విచారణ నిర్వహిస్తున్నామని, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారరు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు అనపర్తి ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం



సామర్లకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో మూడవ నంబరు ట్రాక్ వద్ద సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని సామర్లకోట రైల్వే పోలీసులు ఆదివారం గుర్తించారు. గూడ్స్ రైలు లోకోపైలట్ అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం ఎడమచేతిపై పి.నాగేశ్వరరావు, లోవ అనే పేర్లు.. కుడిచేతి దండపై సూర్యుడి గుర్తు, ఎడమ చేతిపై పాము ఆకారములో పచ్చబొట్టులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ ఇంచార్జి పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

కాకినాడ

నేడు చంద్రమాంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

పెద్దాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో సోమవారం ట్రినిటీ ఆసుపత్రి (కాకినాడ) సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తారని, పరిసర గ్రామ ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సహకార, సాగునీటి సంఘాల

ఎన్నికల్లో విజయం సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న సహకార, సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం దిశగా కూటమి నేతలు కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులను పూర్తిగా నెగ్గించే బాధ్యత స్థానిక నాయకత్వం తీసుకోవాలన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా జనసేన నేతలను సమన్వయం చేసుకుని ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రక్రియను నిర్వహించాలన్నారు. స్థానికంగా ఎటువంటి ఇబ్బంది వచ్చినా తక్షణం తన దృష్టికి తీసుకురావాలన్నారు. అందరికీ తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని కార్యకర్తలకు ఆయన సూచించారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా?

- పెద్దాపురం ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద ఆగని వాణిజ్య సముదాయాల నిర్మాణం పనులు
- ముందుభాగంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- భయాందోళన చెందుతున్న ప్రజలు



వాణిజ్య పముదాయల ముందు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెద్దాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ ముందు భాగంలో నిర్మితమవుతున్న వాణిజ్య సముదాయల నిర్మాణం పట్టణంలో రోజురోజుకూ వివాదాస్పద మవుతోంది. ఇప్పటికే ఈవిషయం పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పైగా నిర్మాణం పనులు నిలువరించకుండా మిన్నకుండిపోవడమే కాకుండా లేఖలతో కాలక్షేపం చేస్తున్నారు. దీంతో మున్సిపల్ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య సముదాయాల నిర్మాణం పూర్తయితే పలు ప్రమాదాలు సంభవి స్తాయని, నిర్మాణం పనులను నిలువరించాలని ప్రజలతో పాటు కౌన్సిల్ సభ్యులు పలువురు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. పైగా వాణిజ్య సముదాయల ముందుభాగంలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం మరింత భయాందోళన కలిగిస్తోంది. పైగా ఆర్టీసీ అధికారులు ప్రజలప్రాణాలు లెక్కలేనట్టు నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టడం చూస్తుంటే ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

రెవెన్యూ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్డు వేములవారి జంక్షన్‌లో ఉన్న రెవెన్యూ స్థలంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి ఆదివారం ప్రారంభించారు. కాజా ఫౌండేషన్ (హైదరాబాద్) వ్యవస్థాపకుడు కాజా నరసింహమూర్తి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ భవనాన్ని నిర్మించినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. స్థానిక కోర్టు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్థానిక సీహెచ్‌సీలో బాలింతలకు మిషన్ అన్నపూర్ణ, మన పెద్దాపురం ఫేస్‌బుక్ పర్యవేక్షణలో కిట్లు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగినట్లు ఫౌండేషన్ ప్రతినిధి కాజా బుచ్చి రాజేశ్వరరావు తెలిపారు. కాజా ఫౌండేషన్ సభ్యులు, మున్సిపల్ అధికారులున్నారు.

జములపల్లి మాజీ సర్పంచ్ మృతి

పిఠాపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం జములపల్లి మాజీ సర్పంచ్ దడాల కొండమ్మ(70) ఆదివారం మరణించారు. ఆమె 1995-2001 మధ్య గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. అప్పటి సీఎం చంద్రబాబు, అప్పటి ఎమ్మెల్యే వెన్నా నాగేశ్వరరావు, అప్పటి ఎంపీపీ బుర్రా శ్రీఆంజనేయ కామరాజుల సహకారంతో గ్రామంలో రోడ్లు, డ్రైయిన్లు నిర్మించడంలో విశేష కృషి చేశారు. ఆమెకు భర్త నూకరాజు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మాజీ సర్పంచ్ కొండమ్మ మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

జనవరి 5న హైందవ శంఖారావం

పిఠాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5వ తేదిన నిర్వహించే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు మణికుమార్, సతీష్‌రెడ్డి కోరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రామాలయంలో ఆదివారం సాయంత్రం గొల్లప్రోలు పట్టణం, చేబ్రోలు, దుర్గాడ, ఏ.విజయనగరం, మల్లవరం గ్రామాలకు చెందిన ముఖ్యులతో ఏర్పాటు చేసిన వారు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు మూర్తి, సోమేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సెజ్ అక్రమాలపై బహిరంగ చర్చకు రావాలి

వైసీపీ నేతలకు వర్మ సవాల్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ సెజ్‌లో తండ్రి కొడుకులు రాజశేఖరరెడ్డి, జగన్ పాల్పడిన అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు రావాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సవాల్ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో బహిరంగ ప్రెస్‌మీట్‌కు వైసీపీ నాయకులు రావాలని సూచించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైసీపీ నేతల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అవినీతి, కుంభకోణాలకు పాల్పడినవారే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాకినాడ సెజ్‌లో జరిగిన అక్రమాలు రోజుకి ఒకటి బయటపడుతుండటంతో వైసీపీ నేతల్లో వణుకు ప్రారంభమైందని తెలిపారు. సెజ్‌రైతులపై టీడీపీ కేసులు పెట్టిందంటూ మాజీ మంత్రులు దాడిశెట్టి రాజా, కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్‌లు ఆసత్యాలు మాట్లాడుతున్నారని చెప్పారు. సెజ్ తీసుకువచ్చింది మాజీ సీఎం రాజశేఖరరెడ్డి అని, కేసులన్నీ అప్పుడే నమోదయ్యాయని తెలిపారు. ఓఎస్‌జీసీ పేరుతో రైతుల భూములు కొల్లగొట్టి, భూమలు తీసుకోవడం పూర్తయిన తర్వాత ఎందుకు ఓఎస్‌జీసీని దూరం చేశారని ఆయన నిలదీశారు. ఆ భూములను బినామీలకు కట్టబెట్టి టీడీపీపై నిందలు వేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సెజ్‌పై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు..రాజశేఖరరెడ్డి, జగన్ రైతులపై పెట్టిన కేసులు, లాక్కొన్న భూములు, కంపెనీలు రాకుండా చేయడం, భూములను బినామీల పేరుపై రాయించుకున్న వ్యవహారం తదితర అంశాలపై బహిరంగా చర్చిద్దామని వర్మ సూచించారు. మాజీ మంత్రులు కన్నబాబు, రాజా, గీతలు చర్చకు రావాలని లేకుంటే వైసీపీ నేతలు అవినీతికి పాల్పడినట్టేనని తెలిపారు.

ముగిసిన భగవద్గీత శ్లోక పఠన పోటీలు

పిఠాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠన పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. గీతాజయంతిని పురస్కరించుకుని విద్యాగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. 80మందికి పైగా విద్యార్థులు భగవద్గీత 12వ అధ్యాయంలోని శ్లోకాలను పఠించారు. సీనియర్స్ విభాగంలో సీహెచ్ వైష్ణవి, కె.ప్రాజ్యేశ్ శర్మ, ఐ.అభిరామ్‌శర్మ- జూనియర్స్ విభాగంలో వాడ్రేవు రాజనిధీశ్వర్, పి.యగ్నేష్, కొండపల్లి శ్రీప్రజ్ఞ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. వారికి బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా రాయప్రోలు కామేశ్వరశర్మ, కోట జగన్నాధశర్మ, రేగళ్ల నీలకంఠ శర్మ, వింజమూరి గాయత్రి వ్యవహరించారు. సేవాసమితి అధ్యక్ష, ఉపాధ్యక్షులు సరస్వతుల శ్రీకాంత్‌శర్మ, రామకృష్ణ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అలసత్వంగా వ్యవహరిస్తే ఊరుకోం



అరట్లకట్ట రైసుమిల్లు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ రాహుల్‌మీనా

రైసుమిల్లులను తనిఖీ చేసిన జేసీ

కరప, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకట్ట రైసుమిల్లును ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎం.దేవ్‌లానాయక్, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబులు తనిఖీచేసి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతుసేవాకేంద్రంలో ట్రక్‌షీట్ జనరేట్ చేసిన తరువాత సంబంధిత మిల్లుకు ఎంత సమయంలో ధాన్యం చేరుతున్నాయని జేసీ ఆరా తీశారు. పుట్టకొండ ఆర్ఎస్‌కే నుంచి ట్రక్ షీట్ జనరేట్ అయిన ట్రాక్టర్ ఇంతవరకు రైసుమిల్లుకు చేరకపోవడానికి కారణమేమిటని సిబ్బందిని ప్రశ్నించారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అల్పపీడన ప్రభావంతో వాతావరణం మారిందని, రైతులు అప్రమత్తమై త్వరితగతిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు. కళ్లాల్లో ధాన్యాన్ని వెంటనే రైసుమిల్లులకు వేగవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవో మల్లిబాబు నడకుదురు, పెనుగుదురు గ్రామాల్లోని పలు రైసుమిల్లులను తనిఖీచేసి నిర్వాహకులకు, సిబ్బందికి సూచనలు చేశారు. తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ, ఏవో అప్పసాని వెంకటరాజేష్, వీఆర్‌వోలు కుంపట్ల గణపతి, చాగంటి వరుణ్ తదితరులు ఉన్నారు.

'భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి'

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, సుబ్బారావు



సమావేశంలో పాల్గొన్న వక్తలు

కాకినాడ సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారత రాజ్యాంగాన్ని మార్చాలని నేడు మోదీ ప్రభుత్వం చూస్తోందని, మనువాద శక్తుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు పిలుపునిచ్చారు. పీఆర్‌భవన్‌లో రాజ్యాంగ పరి రక్షణ సదస్సు డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్య దర్శి ఎస్.రామకృష్ణ ఆదివారం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాజ్యాంగం ఎంత ఉన్నతమైన దైనా దాన్ని అమలుచేసేవారు ఉన్నతులు కాక పోతే ఉపయోగంలేదన్నారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, న్యాయవాది టి.ముకేష్, వివిధ సంఘాల నాయకులు టి.అన్నవరం, రాజువర్ధన్, చింతపల్లి సుబ్బారావు, బల్ల సురేష్ పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సు పూర్తిచేస్తే

ఉన్నతమైన ఉద్యోగాలు

ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చిరంజీవినీకుమారి

కాకినాడ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో చేరి కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు మంచి స్థితిలో స్థిరపడటంతో పాటూ ఉన్నతమైన ఉద్యోగాలు సాధించవచ్చని ఐడియల్ కళాశాల కరస్పాండెంట్, పీజీ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి తెలిపారు. కాకినాడ ఐడియల్ కళాశాల పీజీ కోర్సుల విభాగంలోని ఇగ్నో స్టడీ సెంటర్‌లో ఈఏడాది ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఆదివారం పరిచయ సమావేశాన్ని ఇన్‌చార్జి సమన్వయకర్త బి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పి.చిరంజీవినీకుమారి, విశిష్ట అతిథిగా ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు. చిరంజీవినీకుమారి మాట్లాడుతూ ఇగ్నోలో 300కు పైగా కోర్సులను ఆఫర్‌చేస్తున్నారన్నారు. కృష్ణారావు మాట్లాడుతూ కాకినాడలో ఇగ్నో స్టడీ సెంటర్ ప్రారంభించి 30 ఏళ్లు పూర్తయిందని ఏడాదికి 2సార్లు ప్రవేశాల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ కృష్ణారావు

సామాజిక స్థలం ఆక్రమణకు యత్నం.. పంచాయతీ నిర్లక్ష్యం



ఆక్రమణకు గురైన సామాజిక స్థలాన్ని చూపిస్తున్న జనసేన నాయకులు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ, ప్రభుత్వ స్థలాలను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే అధికారుల ఉదాశీన వైఖరి కారణంగా విలువైన ప్రభుత్వ, పంచాయతీ స్థలాలు కబ్జాదారుల పరం అవుతున్నాయి. కాకినాడ రూరల్ తిమ్మాపురంలో సర్వే నెంబర్ 185 ఎల్‌పీ నెంబర్‌లో 645/85లో లేఅవుట్‌లో 21సెంట్లు సామాజిక స్థలాన్ని పంచాయతీకి దఖలు చేశారు. ఈస్థలం ఖాళీగా ఉండటంతో కబ్జాదారులు ఈస్థలాన్ని ఆక్రమించుకునేందుకు పలుసార్లు ప్రయత్నించడం, స్థానికులు అడ్డగిస్తున్నారు. ఇటీవల మరలా ఈస్థలం ఆక్రమణకు ప్రయత్నాలు జరిగితే స్థానిక కూటమి నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మండల సర్వేయర్ ఆధ్వర్యంలో ఇటీవల సర్వే చేపట్టి, ఈ స్థలం గ్రామ పంచాయతీకి చెందిన సామాజిక స్థలంగా కొలతలు నిర్వహించిన అనంతరం సర్వేయర్ నిర్ధారించారు. దాంతో స్థానిక కూటమి నాయకులు స్థలంలో ఉన్న చెత్త, పిచ్చిమొక్కలు, ఫెన్సింగ్‌లను తొలగింపచేసి, స్థలాన్ని బాగు చేశారు. సామాజిక స్థలం మరోసారి కబ్జాకు గురికాకుండా స్థలం చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు విజప్తి చేశారు. ఫెన్సింగ్ ఏర్పాటులో అధికారుల జాప్యంతో మరలా ఆక్రమణ దారుడు స్థలం చుట్టూ రక్షణగా క్లాత్‌తో ప్రహరీగా ఏర్పాటు చేశాడు. విషయం తెలిసిన కూటమి నాయకులు బత్తుల దొరబాబు, చోడిశెట్టి ఇంద్రలు సామాజిక స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. విలువైన పంచాయతీకి చెందిన సామాజిక స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేయకుండా పరోక్షంగా ఆక్రమణదారులకు సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతుంటే తమ వద్ద డబ్బులు లేవంటూ నిర్లక్ష్యంగా జవాబు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఉదాశీన వైఖరితో పంచాయతీ పరిధిలో పలు సామాజిక స్థలాలు పరుల అన్యాక్రాంతమవుతున్నాయని వాపోయారు. సామాజిక స్థలం సంరక్షణ కోసం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యవర్గం ఎంపిక

కాకినాడ సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కమిటీ ఎన్నిక కె.సతీష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రత్యేకఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కౌతరపు ప్రసాద్, విశిష్టఅతిథులుగా కాకినాడ సూపర్‌బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ, ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పు దుర్గా రమేష్ హాజరయ్యారు. జిల్లా కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గా రమేష్ ప్రకటించగా జిల్లా అధ్యక్షుడిగా వొమ్మి రఘురామ్, ప్రధాన కార్యదర్శిగా సుందరపల్లి గోపాలకృష్ణ, జిల్లా కోశాధికారిగా చొప్పెర్ల సునీల్‌లను ఎంపిక చేశారు.

బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ

ఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాజేంద్రప్రసాద్

కాకినాడ సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే బాలికలకు స్వీయ రక్షణ కోసం తమ ట్రస్ట్ ద్వారా మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని జనసేన నేత, మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మల్లాడి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బాలికలు పాఠశాల స్థాయి నుంచే ధైర్యంగా ఉండేందుకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఒక మహిళా శిక్షకురాలిని ఏర్పాటుచేశామని, ఉచిత శిక్షణ విషయమై కలెక్టర్‌కు విన్నవించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం

పెద్దాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రతీ ఆదివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం సహాయ కమిషనర్ కురం విజయలక్ష్మి తెలిపారు. అన్నప్రసాద వితరణకు దాతలు సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు.

బాలికకు ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ రాజీవ్ గృహకల్ప సముదాయంలో ప్రమాదవశాత్తూ మంటల్లో తీవ్ర గాయాల పాలైన బాలికకు కాకినాడ ఖిద్మాత్ కమిటీ సభ్యులు ఆదివారం రూ.10వేలు అందజేశారు. టీడీపీ మైనారిటీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎంఎ తాజుద్దీన్ మాట్లాడుతూ బాలికకు వైద్యం నిమిత్తం సాయం అందించడం అభినందనీయమన్నారు. ఖిద్మాత్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే చిష్టి, కార్యదర్శి హుస్సేన్, కమిటీ ఫౌండర్ అధ్యక్షుడు షరీఫ్, సభ్యులు ఫక్రుద్దీన్ ఆలీ, షామొద్దీన్ పాల్గొన్నారు.

సూర్యారావుపేట సముద్రతీరంలో సందడి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. చిన్నారులు, పెద్దలు, యువతల రాకతో సముద్ర తీరం సందడిగా మారింది. చిన్నారులు తీరంలో ఉత్సాహంగా గడిపారు. యువత సముద్రస్నానాలు చేసి ఎంజాయ్ చేశారు. లైట్‌హౌస్ సమీపంలో ఉన్న శిల్పారామానికి అధిక సంఖ్యలో సందర్శకులు వెళ్లారు. సముద్ర అలల తీవ్రత అధికంగా ఉండటంతో సముద్ర స్నానాలకు వెళ్లిన పర్యాటకులను పోలీసులు వారించారు. తీరంలో వాకలపూడి మెరైన్ సీఐ రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్ఐ మధు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.



సముద్రతీరంలో సందర్శకుల కోలాహలం

పనసపాడులో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవ సోదరులు

సామర్లకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పనసపాడు గ్రామం పల్లపు వీధిలో యెహోవాయీరే ప్రార్థనా మందిరంలో ఆదివారం ఉదయం నుంచి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సాయంత్రం చర్చి వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఎస్.జయశీల్ క్రిస్మస్ సందేశం అందించారు. పాస్టర్ ఎస్.ప్రభుదాసు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కిస్మస్ గీతాలు ఆలపించారు. నొక్కి ఛాయా, ఏంజెల్, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా పరస నాగవెంకటసురేష్ కుమార్, జనరల్ సెక్రటరీగా బట్లంకి ఆంజనేయులు, సెక్రటరీగా అయినపర్తి నరసింహారావు, వైస్ ప్రెసిడెంట్ కె.ఎంఎంఆర్ ప్రసాద్, కోశాధికారి వైవీ సుబ్రహ్మణ్యాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అందరికీ, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వార్డు ఇన్‌చార్జిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జొన్నాడ వెంకటరమణ, వాసిరెడ్డి సత్యకుమార్, కవికొండల ప్రభాకర్, కలగా శివరాణి తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ పార్కు వాకర్స్ నూతన అసోసియేషన్

కొరుపల్లి వీఆర్వోకు గుండెపోటు

పని ఒత్తిళ్లే కారణమంటున్న కుటుంబ సభ్యులు, సహచరులు

కరప, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొరుపల్లి వీఆర్‌వో పీవీవీ శ్రీనివాసరావు శనివారం అర్ధరాత్రి గుండెపోటుకు గురయ్యారు. కుటుంబసభ్యులు కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు స్టంట్‌లు పడతాయని నిర్ధారించారు. రెండు నెలలుగా పని ఒత్తిళ్లే దీనికి కారణమని కుటుంబసభ్యులు, సహచర వీఆర్‌వోలు ఆరోపిస్తున్నారు. ఆర్ఐ సీహెచ్.పవన్, వీఆర్‌వోల సంఘం నాయకులు మేడిశెట్టి కిషోర్‌కుమార్, డి.భరణికుమార్‌లు ఆసుపత్రికి వెళ్లి వీఆర్‌వోను పరామర్శించారు. ఈసందర్భంగా బాధిత వీఆర్‌వో, సంఘ నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నామని ఆవేదనవ్యక్తంచేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు



గొల్లప్రోలు రూరల్,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలో వేంచేసి ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న షష్ఠి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అభిషేకాలు జరిగాయి. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, శక్తి వేషధారణలు, శూలాల సంబరం నిర్వహించారు. మల్లవరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి క్షీరాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరిగాయి. ఆలయ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పిఠాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కలిసి చదువుకున్న వారంతా 28ఏళ్ల తర్వాత ఒకేచోటకు చేరారు. జ్ఞాపకాల వర్షంలో తడిచి ముద్దయ్యారు. పిఠాపురం పట్టణంలోని ఏకేపీఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం పట్టణ శివారులోని ఇల్లింద్రాడ వద్ద గల అరిగెల వీరబాబు మామిడితోటలో వనసమారాధనతో కలుసుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వృత్తి, వ్యాపారాల రీత్యా స్థిరపడిన వారంతా వన సమారాధన(గార్డెన్‌పార్టీ) తరలివచ్చారు. ఒకరిని ఒకరు పలకరించుకుని కుటుంబ క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. ఆ నాటి అల్లరి, చిలిపి పనులు, ఉపాధ్యాయుల మందలింపులు గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఉలవల భూషణం, తోట సుమన్, ర్యాలీ సుబ్బారావు, కొత్తెం రాజేశ్వరరావు, కరణం సూరిబాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో కలుసుకున్న ఏకేపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలు



పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

సామర్లకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్ మెరిట్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అర్హత పరీక్ష ఆదివారం సామర్లకోటలో రెండు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 264మంది విద్యార్థులకు 249 మంది, అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 312మందికి 288 మంది హాజరయ్యారన్నారు. రెండు పరీక్షా కేంద్రాల్లో 39మంది హాజరుకాలేదన్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈపరీక్షకు హాజరయ్యారన్నారు. పరీక్షల నిర్వహణ తీరును అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ రాజశేఖర్ డీసీఈబీ కార్యదర్శి ఎం.వెంకట్రావు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల చీఫ్‌లుగా యూ.మీనామాధురి, తోటకూర సాయి రామకృష్ణ, డిపార్ట్‌మెంట్ అధికారిగా టి.శ్యామ్ సుందర్ వ్యవహరించారని ఎంఈవో చెప్పారు.

భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం

సర్పవరంజంక్షన్,డిసెంబరు8(ఆంధ్ర జ్యోతి): కార్తీక మాసంలో అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణస్వామిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటుచేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసును ఈవో, అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్ అభినందించారు. ఆదివారం దేవస్థానంలో ఏసుదాసు కుమారుడు రమేష్‌బాబుకు ప్రశంసా పత్రం అందించి ఈవో అందించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదు



వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి మిల్లర్లను ఆదేశించారు. స్థానిక వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌లో ఆమె ఆదివారం తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తేమ శాతం, ఇతర కారణాలతో ధాన్యం వాహనాలను వెనక్కి పంపకూడదని, వాహనాలను ఆలస్యం చేయకుండా ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ కాంతారావు పాల్గొన్నారు.

ప్రొటీన్లు అధికంగా తీసుకోవాలి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని వృద్ధులు తీసుకోవాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ కోరారు. ఆదివారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు రత్నప్రసాదరావు, ప్రసాద్‌నాయుడు, రాఘవరావు పాల్గొన్నారు.

12న ఆంధ్ర భద్రాద్రి క్షేత్రంలో పాదుకా పట్టాభిషేకం

ప్రత్తిపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని ఆంధ్ర భద్రాద్రి క్షేత్రంలో ఈ నెల 12న త్రిదండి చినజీయరు స్వామి ఆధ్వర్యంలో పాదుకా పట్టాభిషేకం జరగనుంది. ఆ క్షేత్ర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోగుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆదివారం ఇరిపాక వెళ్లి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.


పొల్లూరు జలపాతం వద్ద రక్షణ కవచంగా ఏర్పాటు చేసిన ఇనుప మెష్

పొల్లూరు జలపాతం వద్ద రక్షణ చర్యలు

మోతుగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీసీఎఫ్ బీఎస్ఎస్ మూర్తి ఆదేశాల మేరకు డీఎఫ్‌వో బబిత పర్యవేక్షణలో లక్కవరం రేంజర్ నానాజీ ఆధ్వర్యంలో పొల్లూరు జలపాతం వద్ద అటవీ శాఖ సిబ్బంది ఇనుప మెష్‌లు ఏర్పాటు చేశారు. కొంతకాలంగా జలపాతం వద్ద మరణాలు కొనసాగుతుండడంతో వాటిని అదుపు చేసే ప్రయత్నంలో భాగంగా ఈ ఇనుప మెష్‌లు ఏర్పాటు చేస్తున్నామని లక్కవరం రేంజర్ నానాజీ తెలిపారు. పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో వారు వినియోగించి వదిలిపెట్టిన ప్లాస్టిక్, సామగ్రి జలపాతం వద్ద కుప్పలు తెప్పలుగా పేరుకుపోతోంది. దీంతో పర్యావరణాన్ని కాపాడే ప్రయత్నంలో భాగంగా వారంలో ఒక రోజు అనగా ప్రతి శుక్రవారం జలపాతం, పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ సంబంధిత వ్యవర్థాలను సేకరించి అక్కడి వాతావరణాన్ని పరిశుభ్రం చేస్తున్నామని లక్కవరం రేంజర్ చెప్పారు.


పాపికొండలు వెళ్లేందుకు సిద్ధమైన బోట్లు

11 బోట్లలో పాపికొండలు విహార యాత్రకు

దేవీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహార యాత్రకు ఆదివారం 11 బోట్లలో సుమారు 850 మంది పర్యాటకులు వెళ్లారు. పోశమ్మగండిలోని బోటు పాయింట్ నుంచి ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని అనంతరం పేరంటాలపల్లి వెళ్లారు. మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే పవిత్రమైన గోదావరిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు.

సంత నిర్వహణ ప్రదేశం మార్పు



మోతుగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఆదేశాలతో మోతుగూడెం సంత ఏర్పాటులో మార్పులు చేశారు. సంతను మెయిన్ రోడ్డుపై నిర్వహించడంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు, ప్రయాణికులు, పర్యాటకులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. అంతేగాక ఆదివారం సంత నిర్వహించడంతో పలు రకాలైన వాగ్వాదాలు జరుగుతున్నాయి. మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్ పర్యవేక్షణలో ఈ ఆదివారం సంత నిర్వహణలో కొన్ని మార్పులు చేశారు. ప్రధాన రహదారిలో షాపులను తొలగించి అటు పక్కగా ఉన్న సర్కిల్ పాయింట్ వద్ద సంత ఏర్పాటు చేశారు. దీంతో అమ్మకందారులకు, కొనుగోలుదారులకు సంత నిర్వహణ సంతృప్తికరంగా ఉంది. ఈ సంత గ్రామస్తులు, పర్యాటకులు, వాహనచోదకులు గ్రామ సచివాలయానికి ఫిర్యాదు చేయడంతో ఈ మార్పులు చేశామని కార్యదర్శి మోహన్ చెప్పారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ యువజన సంఘం సభ్యులు

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

మోతుగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయి వారపు సంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు వారోత్సవాలు, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆదివారం అల్లూరి ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం యువకులు ర్యాలీ నిర్వహించారు.

సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



దేవీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫజుల్లాబాద్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు వేదాశీర్వచనమిచ్చి ప్రసాదం అందజేశారు. టీడీపీ నాయకుడు ఈత శివాజీ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

ఏలేశ్వరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో ఆదివారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి నేతృత్వంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించేందుకే చంద్రబాబునాయుడు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ఇన్సూరెన్సు కల్పిస్తామన్నారు. ఆడారి వీరబాబు, సుంకర సత్తిబాబు, శెట్టి చంద్రబాబు, మాదేపల్లి మంగరాజు, గొల్లపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలు

అడ్డతీగల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల విద్యానికేతన్ ఆవరణలో ఆదివారం ప్రఖండ భగవద్గీత పోటీలు జరిగాయి. ఐదు పాఠశాలలకు చెందిన 52 మంది విద్యార్థులు హాజరయ్యారు. రంగాచార్యలు, త్రివేణి, ప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అడ్డతీగల ప్రఖండ గౌరవ అధ్యక్షుడు దంతులూరి విశ్వనాథరాజు, వీహెచ్‌పీ రంపచోడవరం అధ్యక్షుడు పి.కుమార్రావు, ఎస్.భావనారాయణ హాజరయ్యారు.



ప్రత్తిపాడులో పామాయిల్ రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే సత్యప్రభ, ఆమెకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రత్తిపాడులో ఆయిల్‌పామ్ కర్మాగారం ఏర్పాటు చేయాలి

ఆయిల్‌పామ్ రైతుల సమావేశంలో తీర్మానం: ఎమ్మెల్యేకు వినతి

ప్రత్తిపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణ ఆపాలని, మెట్టప్రాంతమైన ప్రత్తిపాడులో ఆయిల్‌పామ్ కర్మాగారం ఏర్పాటు చేయాలని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండల రైతులు తీర్మానించారు. ఆదివారం ప్రత్తిపాడులో మెట్ట ప్రాంత ఆయిల్‌పామ్ రైతుల సమావేశం నిర్వహించారు. సంఘ నాయకులు రెడ్డి అమర్‌నాథ్, గోగుల బుజ్జి, బొల్లు కొండబాబు, ఎలం సూర్యనారాయణ మాట్లాడుతూ ఏపీ ఆయిల్‌ఫెడ్‌ను ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం జరుగుతోందని, దీనివల్ల ఆయిల్‌పామ్ రైతులకు తీరని నష్టం వాటిల్లుతుందని తెలిపారు. మెట్టలో ఆయిల్‌పామ్ కర్మాగారం లేకపోవడంతో రైతులు నష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో 2,429 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టారని ఈ ఏడాది 2శాతం సాగు పెరిగిందన్నారు. 190 కిలోమీటర్ల దూరంలో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి ఆయిల్‌పామ్ కర్మాగారానికి ఉత్పత్తులను తరలించేందుకు ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని.. రవాణా, ఇతర ఏర్పాట్లకు అధిక సొమ్ములు చెల్లించి గిట్టుబాటు కోల్పోతున్నామని తెలిపారు. ఆయిల్‌ఫెడ్‌ను ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాల వల్ల మెట్ట ప్రాంత రైతులకు కష్టాలు మరింత పెరగనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నిటికీ పరిష్కారంగా ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటే శ్రేయస్కరమని, తద్వారా రైతులకు, స్థానికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు అందజేశారు. రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జి.వెంకటేశ్వరరావు, ఫకీర్ రాజు, రీసు సత్తిబాబు, ఇందన ఏసుబాబు, చెక్కపల్లి బూరయ్య, రాసంశెట్టి రాజా, కొప్పన రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


మూసివేసిన దారి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

రహదారికి గండి రైతుల ఆందోళన

రౌతులపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఎస్ఎస్ పట్నం గ్రామంలో 300 ఎకరాలు కొండపోడు భూములకు వెళ్లే రహదారికి అడ్డంగా గండి కొట్టారు. దీంతో ఈ ప్రాంతానికి చెందిన రైతులు గండికొట్టిన చోట ఆదివారం ఆందోళనకు దిగారు. ఎస్సీ ఎస్టీ, బీసీ కులాలకు చెందిన వారి భూములకు వెళ్లే మార్గాన్ని మూసివేయడం దారుణమన్నారు. 16ఏళ్ల క్రితం ఉపాధి హామీ నిధులతో రహదారి నిర్మించుకున్నామని, పంటలను ఈ మార్గంలోనే తరలించుకుంటున్నామని చెప్పారు. అధికారులు స్పందించి వేణుగోపాలస్వామి ఆలయం నుంచి త్రివేణి గంగదారిలో అడ్డంగా గండికొట్టిన ఏనుగుపల్లి చిన్నారావు, ఏనుగుపల్లి సింహాచలంలపై చర్యలు తీసుకుని రైతులకు దారి చూపాలని కోరారు.


పీఎంకు రాసిన ఉత్తరాలను చూపిస్తున్న కార్మికులు

జీడిపిక్కల పరిశ్రమను తెరిపించండి

ఉత్తరాలు రాసి సీఎంకు పంపిన కార్మికులు

ఏలేశ్వరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీడిపిక్కల పరిశ్రమను తెరిపించాలని కోరుతూ కార్మికులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఉత్తరాలు రాశారు. 409 మంది కార్మికులు ఉపాధి లేకుండా సుమారు 23 రోజులుగా నిరసన తెలుపుతున్నా యాజమాన్యం పట్టించుకోవట్లేదన్నారు. సీఎం స్పందించి పరిశ్రమను తెరిపించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఉత్తరాలు రాసి ముఖ్యమంత్రి కార్యాలయానికి పోస్టు చేశారు.


కొలిమేరులో పట్టుబడిన బియ్యం నిల్వలు, పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

బియ్యం అక్రమ నిల్వల గుట్టు రట్టు

తుని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తుని మండలం కొలిమేరు గ్రామంలో ఓ కోళ్లఫారంలో గుట్టుచప్పుడు కాకుండా దాచిపెట్టిన బియ్యం నిల్వలు అధికారులకు పట్టుబడ్డాయి. రెవెన్యూ అధికారులు వాటిని సీజ్ చేసి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు తరలించగా అవి పీడీఎస్ బియ్యమేనని తేలాయి. దీంతో అధికారులు నిల్వ ఉంచిన సుమారు 25 టన్నుల రేషన్ బియ్యాన్ని రేఖవానిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. కాగా బియ్యం క్రయ, విక్రయాల్లో స్థానిక రేషన్‌డీలర్ల ప్రమేయం ఉన్నట్టు తెలుస్తోంది. కొద్దికాలంగా కొలిమేరు గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడి అండతో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం క్రయ, విక్రయాలు జరిపి ఆ నాయకుడి రైస్‌మిల్లుకు తరలించి ప్రాసెసింగ్ అనంతరం బహిరంగ మార్కెట్లో అమ్మకాలు జరుపుతున్నట్టు ప్రాథమిక నిర్ధారణతో తేటతెల్లమవుతోంది. ఈ అడ్డగోలు వ్యవహారంలో ఎవరున్నారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. దీని వెనుక ఎవరున్నా చర్యలు తప్పవని ఎంఎస్‌వో రాజు చెప్పారు.

ఎస్ఎంసీ చైర్మన్‌కు ఆత్మీయ సత్కారం



తుని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తేటగుంట జిల్లా పరిషత్ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా విశేష సేవలందిస్తున్న చామంతి దుర్గారావును విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ అప్పలరాజు మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతున్న దుర్గారావు సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో చామంతి సత్తిబాబు, పేరూరి కృష్ణ, కాపారపు ప్రకాశరావు, గణేశుల దాసుబాబు, కోలా సతీష్ తదితరులు పాల్గొన్నారు.



జీవిత లక్ష్యం పెట్టుకోండి

సీఐ శ్రీనివాస్

జగ్గంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా పయనించాలని జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆటలు ఆడుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఉన్నత చదువలు చదివితే మంచి భవిష్యత్తు, అందరిలోనూ గౌరవం ఉంటుందన్నారు.


అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో వేచివున్న భక్తులు

'లోవ'కు పోటెత్తిన భక్తులు

ఒక్కరోజు ఆదాయం రూ.3.90 లక్షలు



తుని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు క్యూలైన్లలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో తరలివచ్చిన భక్తులు ఆరుబయట, దేవస్థానం వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా రూ.3.90 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు.


శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్‌కు స్వామివారి శేషవస్త్రం అందజేస్తున్న ఈఈ రామకృష్ణ

రవాణా దాతలకు సత్కారం

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పర్వదినాల్లో సత్యదేవుని దర్శనానికి లక్షలాదిగా విచ్చేసిన భక్తులను కొండపై ఉచిత రవాణాకు శ్రీప్రకాష్ విద్యా సంస్థలు, తిరుమల విద్యా సంస్థలు, వానిరెడ్డి రమేష్‌బాబు బస్సులు అందజేసి సహకరించారు. ఆదివారం వారిని దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

రేపటి నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

తొండంగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు మురార్జీ, ఆర్ఐ రాజారావు తెలిపారు. 10న ఆనూరు, 11న పి.అగ్రహారం, 12న పైడికొండ, 13న వేమవరం, 16న కృష్ణాపురం, 17న శృంగవృక్షం, 18, 19 తేదీల్లో ఎ.కొత్తపల్లి, 20న గోపాలపట్నం, 21న బెండపూడి, 23 రావికంపాడు, 26 కొమ్మనాపల్లి, 27న పీఈ చిన్నయ్యపాలెం, 28న ఏవీ నగరం, 30, 31, జనవరి 2 తేదీల్లో కోన ఫారెస్ట్, జనవరి 3, 4, 7 తేదీల్లో తొండంగిలో సదస్సులు జరుగుతాయి. గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంపకలోవలో 400 లీటర్ల బెల్లపు ఊటను ఆదివారం ఎక్సైజ్ సిబ్బంది ధ్వంసం చేశారు. దాడుల్లో సీఐ శివప్రసాద్, ఎస్ఐ వంశీరాం సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల ర్యాంపు నుంచి ఇసుక అక్రమ తరలింపులో సంబంధం లేదు

రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం గుండాల ఇసుక ర్యాంపు నుంచి ఇసుక అక్రమ తరలింపు చేసే వ్యక్తులతో తమకు సంబంధం లేదని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె మీడియాకు ఓ వీడియోను విడుదల చేశారు. గుండాల ఇసుక ర్యాంపు వ్యవహారంలో కొంతమంది తన పేరు, తన భర్త పేరు వాడుతున్నారని తెలిసిందన్నారు. తాము అక్రమాలను ప్రోత్సహించేది లేదని, అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని తామే కోరుతున్నామన్నారు. రంపచోడవరంలో గిరిజనేతరుల ఇళ్లపై తాము ఎల్‌టీఆర్‌పీ కేసులు పెట్టిస్తున్నామన్న ప్రచారాన్ని కూడా కొందరు చేస్తున్నారని, తమకు గిరిజన-గిరిజనేతర వ్యత్యాసం లేదన్నారు. తమ పేరు చెప్పి కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతు న్నారని కూడా తమ దృష్టికి వచ్చాయని, ఎవరు తమ పేరుతో వసూళ్లకు పాల్పడినా ప్రజలే వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కొందరు మీడియా పేరుతో అడ్వర్‌టైజ్‌మెంట్లు అడుగుతున్నారని, సానుకూలంగా స్పందించకపోవడంతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'

రంపచోడవరం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిపై నిరాధారమైన ఆరోపణలు సరికాదని టీడీపీ తెలుగు కార్మిక సంఘం రంపచోడవరం ఉపాధ్యక్షుడు సలాది బాపిరాజు అన్నారు. ఎమ్మెల్యే శిరీషదేవి, ఆమె భర్త మఠం విజయభాస్కర్ ఎటపాక మండలంలో ఇసుక అమ్మకాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు కొందరు ప్రచారం చేయడం హేయనీయమైన చర్య అని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిరీషదేవి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొన్ని రోజుల్లోనే నియోజకవర్గంలో అనేక సేవ కార్యక్రమాలు చేశారని, ప్రభుత్వ ఆసుపత్రులకు ఉచితంగా ఇన్వర్టర్లు అందించారన్నారు. సొంత వాహనాన్ని అంబులెన్స్‌గా మార్చారని, ఇటువంటి విషయాలు ఓర్వలేకే కొంతమంది ఎమ్మెల్యే దంపతులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.